క్లుప్తంగా

మామిడి కోత పరికరాల పంపిణీ



మామిడి కోత పరికరాలు అందజేస్తున్న శాస్త్రవేత్త శ్రీలత

వెదురుకుప్పం: మండలంలోని ధర్మాచెరువు, గెరిగదొన గ్రామాల్లో మహిళలకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మామిడి కోత పరికరాలను పంపిణీ చేశారు. బుధవారం గృహవిజ్ఞాన శాస్త్ర విభాగం శాస్త్రవేత్త శ్రీలత రెండు గ్రామాల్లో ఉన్న మామిడితోటలు కలిగిన మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ప్రయోగాత్మక ప్రదర్శన క్షేత్రాల ద్వారా చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆదాయాలు పొందే మార్గాల్లో ఇదీ ఒకటన్నారు. మామిడి కాయల కోత పరికరాలు అందజేసి ప్రయోగాత్మకంగా చేసి చూపించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్

కార్వేటినగరం: మండలంలోని కేపీ అగ్రహారం పంచాయతీ బీసీ కాలనీలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి బుధవారం వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీపీ లత చొరవతో వినాయకుడి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు, అదేవిధంగా కమ్యూనిటీ భవనం నిర్మాణానికి రూ.35 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్ల కాలంలో అన్ని పంచాయతీలు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చిన్నబ్బ మందడి, మహిళలుపాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం : కుష్టు వ్యాధి బాధితులను గుర్తించేందుకు ప్రభుత్వం ఇంటింటా సర్వే నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్ కృష్ణ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందికి సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి సమీక్షించారు. సమావేశంలో డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా రోగులను గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలు అందించేందుకు ఎల్‌సీడీసీ(లెప్రసీ కేస్ స్టడీ డిటెక్షన్ క్యాంపెయిన్)ను నిర్వహించాలని తెలిపారు. శరీరంపై స్పర్శ లేని రాగిరంగు, మచ్చలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. జూలై 7వ తేదీ వరకు సర్వేను కచ్చితంగా చేయాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీడీ సుబ్రమణ్యం

పాలసముద్రం : ఉపాధిహామీ పథకంలో పండ్లతోటల పెంపకంపై ఉపాధిహామీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఉపాధిహామీ కార్యాలయంలో ఆయన ఉపాధిహామీ సిబ్బందికి ఇన్‌చార్జ్ ఏపీఓ అనుషా సమక్షంలో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఐదు ఎకరాలు లోపు ఉన్న రైతులకు పండ్లతోటల పెంపకం కింద మామిడి, కొబ్బరి, నేరేడు, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, నిమ్మ, దానిమ్మ వంటి తోటల పెంపకం చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తు తీసుకుని ఎస్టిమేషన్ వేయాలని సూచించారు. ముఖ్యంగా పనులు నాణ్యతగా చేపట్టాలని హెచ్చరించారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

తలుపులు పగులగొట్టి చోరీ



ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

నగరి : మండలంలోని గొల్లకండ్రిగ గ్రామంలో విద్యాసాగర్ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సీఐ శ్రీనివాసంతి తెలిపిన వివరాల మేరకు తిరుత్తణి సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఎండోమెంట్ విభాగంలో పనిచేస్తున్న విద్యాసాగర్ మంగళవారం రాత్రి తిరుపతికి కుటుంబంతో సహా వివాహానికి హాజరయ్యారు. బుధవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపులు, బీరువాలు పగులగొట్టి ఉండడం, వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉండడం చూసి చోరీ జరిగినట్లు తెలుసుకున్నారు. పోలీసులకు వారు ఫిర్యాదులో పేర్కొన్న మేరకు 2 గ్రాములు బంగారం, రూ.50 వేలు నగదు, అరకేజీ వెండి చోరీకి గురైంది.

థ్యాంక్యూ జగన్ మామయ్యా..

- లబ్ధిదారుల ఖాతాలకు అమ్మఒడి
- నియోజకవర్గంలో 19,122 మందికి లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లులు



ముడిపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తల్లులు

నగరి : పిల్లల చదువుకు పేదరికం అడ్డుకాకూడదు అన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం. ఈ ఉద్దేశం నుంచి పుట్టిందే జగనన్న అమ్మఒడి పథకం. నాలుగేళ్లుగా రాష్ట్రప్రభుత్వం క్రమం తప్పకుండా ఈ పథకాన్ని అమలుచేస్తూ విద్యావికాసానికి బాటలు వేస్తోంది. 2019–20 విద్యా సంవత్సరం నుంచి తల్లులు ఖాతాల్లో ఏటా ఆర్థికసాయం జమచేస్తోంది. వరుసగా నాలుగో ఏటా కూడా అమ్మఒడి సొమ్ము తల్లుల ఖాతాకు జమైంది. అర్హులైన విద్యార్థులందరికీ పథకం వర్తింపజేసేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మండలంలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు, కళాశాలలు, సచివాలయాల్లో అర్హులైన విద్యార్థుల జాబితాను ఇదివరకే ప్రకటించారు. సచివాలయాల్లో నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ఈ పథకం ద్వారా పాఠశాలలకు చిన్నారులను పంపించే అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.13వేలు విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేస్తున్నారు. మిగిలిన రెండువేలలో రూ.1000 టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కు, మిగిలిన రూ.1000 డిస్ట్రిక్ట్ స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ ఫండ్ జిల్లా కలెక్టర్ నియంత్రణలో ఉంటుంది. నగరి నియోజకవర్గంలో 319 పాఠశాలల్లోని 32469 మంది విద్యార్థులుండగా ఆయా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అర్హుల జాబితాను ప్రదర్శించారు. ఈ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి వివరాలను ఆన్‌లైన్‌లో సంబంధిత అధికారులకు అప్‌లోడ్ చేశారు. తుది జాబితా మేరకు 19122 మంది విద్యార్థులు అర్హులు కాగా, మిగిలిన వారిని అనర్హులుగా అధికారులు గుర్తించారు. ఖాతాలకు అమ్మ ఒడి డబ్బులు పడటంతో విద్యార్థుల కుటుంబాల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

ప్లకార్డులతో విద్యార్థులు

నగరి: మండలంలోని ముడిపల్లి గ్రామంలో విద్యార్థులు సర్పంచ్ ప్రకాష్ ఆధ్వర్యంలో నాలుగో విడత అమ్మ ఒడి పథకం పంపిణీ సందర్భంగా థ్యాంక్యూ జగన్ మామయ్య అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వారితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు అమ్మఒడి ఆర్థిక సాయం అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఏటా సొంత మేనమామలా పిల్లల చదువుకు అమ్మఒడి పథకం ద్వారా డబ్బులు అందిస్తున్నారంటూ విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

మండలాల వారీగా గుర్తించిన అర్హుల వివరాలు

మండలం	స్కూళ్లు	మొత్తం విద్యార్థుల సంఖ్య	అర్హత పొందిన విద్యార్థులు
నగరి	115	12535	7285
పుత్తూరు	108	12526	6366
విజయపురం	48	2181	2071
నిండ్ర	48	2169	1504
వడమాలపేట	49	3058	1896
మొత్తం	319	32469	19122



థాంక్యూ జగన్ మామయ్య అంటూ ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు

ఇప్పటివరకు చూడలేదు ఇలా..



విద్యకు ఇంతటి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వాన్ని ఇప్పటివరకు చూడలేదు. పిల్లల చదువు ఆర్థిక భారంతో ఆగిపోకుండా అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో నా కుమార్తెలు ప్రీతి 8వ తరగతి, కావ్యశ్రీ 5వ తరగతి చదువుతున్నారు. నాలుగవ దఫా మా కుటుంబానికి అమ్మఒడి పథకం ఆర్థికసాయం అందింది. ప్రతి పిల్లవాడు బడిబాట పట్టాలని ఆర్థిక భరోసా కోసం జగనన్న ఈ పథకం అందించారు.

- టి.వనిత, ముడిపల్లి, నగరి మండలం.

మేనమామలా సాయపడుతున్నారు



మా పిల్లల చదువుకు జగనన్న మేనమామలా సాయపడుతున్నారు. నాలుగు దఫాలుగా ఆయన అందిస్తున్న ఆర్థికసాయం అందుతోంది. కష్టాలు తెలియకుండా పిల్లలను చదివించుకుంటున్నాం. పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం పెట్టడం, గవర్నమెంట్ బడులను కార్పొరేట్ స్థాయిలో మార్చారు. పిల్లల చదువులు ఏ ఇతర ఆటంకాలతో ఆగకూడదని అమ్మఒడి ఆర్థికసాయం అందిస్తున్నారు. ఈ సాయం మరువలేనిది.

- భాగ్యలక్ష్మి, ఆలపాకం, విజయపురం మండలం

ప్రభుత్వ స్కూళ్లపై ఇష్టం పెరుగుతోంది



విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే పలు పాఠశాలలు నాడు–నేడు పథకం కింద అభివృద్ధి చెంది కళకళలాడుతున్నాయి. అమ్మఒడి ఆర్థికసాయం అందరికీ అందేలా చర్యలు తీసుకున్నాం. కొందరికి ఏవైనా సాంకేతిక కారణాల చేత ఆగినా రీవెరిఫికేషన్‌లో వారికి అందేలా చేస్తాం.

- శ్రీదేవి, ఎంఈఓ, నగరి మండలం

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు



అగ్రహారంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల కుటుంబాల్లో నవరత్నాల పథకాల ద్వారా సంతోషాలు వెల్లివిరిశాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. బుధవారం ఆయన పాతవెంకటాపురం గ్రామ సచివాలయ పరిధిలోని బొజ్జినాయినిపల్లి, గరిగలపల్లి, పాతవెంకటాపురం, అగ్రహారం, నరసాపురం గ్రామంలో సర్పంచ్ సెల్విరాజ, ఎంపీటీసీ లారెన్స్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం డిప్యూటి సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అన్ని రంగాలనూ అభివృద్ధి చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దేశం మొత్తం గుర్తించే విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సుపరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల వారు అట్టడుగు స్థాయిలోనే ఉండేవారని, ఇప్పుడు వారి జీవితాల్లో నవరత్నాల వెలుగులు నింపిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ జనరంజక పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, గృహసారథులు అమ్ములు, సచివాలయ కన్వీనర్ హేమాద్రిరెడ్డి, వెంకటేష్, వైస్ ఎంపీపీ హరిబాబు, గుణశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాలసముద్రం మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సుధాకర్ నాయుడు, నరసింహులు నాయుడు, తహసీల్దార్ ఇన్బనాథన్, ఎంపీడీఓ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరింది..



సొంత ఇల్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే మాకు ఇల్లు ఇచ్చారు. ఇప్పుడు మాకు సొంతింటి కల నెరవేరింది. సంక్షేమ పథకాలు నేరుగా మా ఇంటికి చేరుతున్నాయి. మా గ్రామ సచివాలయంలో ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

- చంద్రమ్మ, అగ్రహారం

గడప గడపకు వచ్చినవారు లేరు



గతంలో ఎన్నికలు వచ్చినప్పుడు ఓట్లు కోసం ఎమ్మెల్యేలు వచ్చేవారు. ఆ తరువాత ఐదేళ్లకు గ్రామాల్లో అడుగుపెట్టేవారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం గెలిచిన మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రజల వద్దకు పంపుతున్నారు. మా సమస్యలను తెలుసుకుని, పరిష్కరిస్తున్నారు. నిజంగా సీఎం జగనన్నకు సెల్యూట్. **- దేవి, అగ్రహారం**

ఉపాధ్యాయులే సమాజ మార్గనిర్దేశకులు



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి సిబ్బంది

కార్వేటినగరం: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఎక్కడికి వెళ్లినా విద్యార్థులకు గుర్తుండి పోయేలా విధులు నిర్వహించాలని డీసీఈబీ కార్యదర్శి, ఆ పాఠశాల హెచ్ఎం హేమారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి సమాజంలో చాలా విలువలతో కూడిందని గుర్తు చేశారు. సమాజ నిర్మాణాన్ని తీర్చిదిద్దే వృత్తిలో ఉంటున్న ఉపాధ్యాయులు ఎక్కడికి వెళ్లినా తమ గుర్తింపును చాటుకోవాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్రీనివాసులు(సాంఘికశాస్త్రం), మురళీకృష్ణరాజు(వ్యాయామ ఉపాధ్యాయుడు), శ్రావణకుమారి(హిందీ) ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరణ చేశారు. ఈ క్రమంలో భాగంగా హెచ్ఎం హేమారెడ్డి, ఉపాధ్యాయ బృందం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య



అడ్మిషన్ చేసుకుంటున్న ఎంఈఓ గిరిజ, రమ్య

పాలసముద్రం : ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉన్నతవిద్యను అభ్యసిస్తామని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రమ్య, ఎంఈఓ గిరిజ తెలిపారు. బుధవారం బలిజకండ్రిగ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓ గిరిజ, రమ్య మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియం నేర్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు చాలావరకు పిల్లలను చదివిస్తున్నారని, ప్రైవేటు కళాశాలలో కష్టపడి సంపాదించిన డబ్బులు వృథా కాకుండా ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలు విద్యార్థులకు మౌలిక వసతులు, ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు. కళాశాలలో విద్యార్థుల్లో అడ్మిషన్ చేసుకున్నారు. ప్రభుత్వం కళాశాలల్లో చదివిన విద్యార్థులే ఉన్నత స్థాయిల్లో ఉన్నారని తెలిపారు. అనంతరం సుమారు 10 మంది విద్యార్థులకు పాలసముద్రం ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ చేశారు. కార్యక్రమంలో బలిజకండ్రిగ హైస్కూల్ హెచ్ఎం మనోహర్‌నాయుడు, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఎంఈఓ నారాయణ సేవలు అభినందనీయం



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న టీచర్లు

నిండ్ర: మండలంలో విద్యాభివృద్ధికి ఎంఈఓ నారాయణ చేసిన సేవలు అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మండలంలోని పాఠశాలలో అభివృద్ధికి ఆయన ఎన్నో సేవలందించారన్నారు. అలాగే ఇరుగువాయి ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన మేరీలలితకు ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేరీ లలిత టీచర్‌గా పిల్లల విద్యాభివృద్ధికి పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందించడం హర్షణీయమన్నారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అభినందించేవారని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆమెను టీచర్ల బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీధర్ రాజు, బాబయ్య, జనార్ధన్ రాజు, మాజీ ఎంఎల్‌ఓ బాలకృష్ణమరాజు, టీచర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం రేపు

నగరి : మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు మెంబర్లు, కోఆప్షన్ మెంబర్లు, వివిధ విభాగాల అధికారులు హాజరు కావాలన్నారు.

నేడు గడప గడపకు..

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఉదయం 6.30 గంటల నుంచి ఎంఎం విలాసం పంచాయతీ కొత్తఇండ్లు గ్రామంలో ప్రారంభమవుతుందని మండల కన్వీనర్ శేఖర్‌రాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకుంటారని అన్నారు. అలాగే గ్రామంలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండలంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు



మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ ఏకాంబరం

పుత్తూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు సత్వరమేలు జరుగుతుందని జేసీఎస్ కన్వీనర్ ఏకాంబరం అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని సత్యనారాయణ కాలనీ, దాసరిగుంట, గోవిందపాళెం, పిళ్లారిపట్టు సచివాలయ పరిధిలోని వలంటీర్లకు, గృహసారథులకు జగనన్న సురక్ష శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి, వివిధ సేవలు, పథకాల లబ్ధి పొందడంలో విఫలమైన వారిని గుర్తించి వారికి లబ్ధి కూర్చడమే ఈ జగనన్న సురక్ష పథక లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.శంకర్, ఎఫ్‌ఓఏ ఎంఎల్‌ఓ దిలిప్‌మొదలి కౌన్సిలర్లు రాజేశ్వరి, రాధ, కుప్పమ్మ, జానకెనడీ, కోఆప్షన్ మెంబర్ షకీలా, నాయకులు జయబాబు, మునిరత్నం, లారీమోహన్, ఏకాంబంరం, జయచంద్ర, మునిరత్నం కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు మండలంలో జరిగిన జగనన్న సురక్ష శిక్షణా కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు పాల్గొన్నారు. ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

శేష వాహనంపై ద్రౌపదీదేవి దర్శనం



పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ ద్రౌపదీ మాన సంరక్షణ ఘట్టాన్ని భక్తులకు కనులకు కట్టినట్లుగా ఆలపించారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపునకు ఉభయదారులైన క్షత్రియ కులస్తులు సారెను తీసుకొచ్చి సమర్పించారు. దీంతో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారిని పట్టువస్త్ర సుగంధ పుష్పాలు, వివిధ రకాల ఆభరణాలతో అర్చకులు కుమారస్వామి ఆచారి ప్రత్యేకంగా అలంకరించారు. శేషవాహనంపై పవళించిన స్వామివార్లను ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి నగర వీధుల్లో ప్రత్యేక వాయిద్యాల నడుమ బాణసంచా పేల్చి వైభవంగా ఊరేగించారు. భక్తులు అమ్మవారికి ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయాదవ్, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన మహాకుంభాభిషేక పూజలు



వినాయకపురంలో కుంభాంభిషేకానికి కలశాల్లో జలాలను తీసుకొస్తున్న వేదపండితులు



శ్రీకావేరిరాజుపురంలో మహాకుభాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం దళితవాడలో వెలసిన రాధా సమేత రుక్మిణీ, శ్రీకృష్ణ ఆలయం, వినాయకపురంలో వెలసిన విఘ్నేశ్వర ఆలయంలో బుధవారం మహాకుంభాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం మహాకుభాభిషేకంలో భాగంగా వేదపండితులు నవగ్రహ హోమం, శాంతి హోమం, నాలుగోకాల యాగశాల పూజలు చేశారు. శ్రీకావేరిరాజుపురం దళితవాడల్లో స్వామి, అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం 7.30 నుంచి 8 గంటల మధ్య వినాయకపురంలో వేదపండితులు వివిధ యాగశాలల్లో ఉంచి కలశాలను ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేసి గుడిపై నుంచి జలాలతో మహాకుంభాభిషేకం చేపట్టారు. శ్రీకావేరిరాజుపురం దళితవాడలో ఉదయం 9 నుంచి 10.30 గంల మధ్య యాగశాల్లో ఉంచిన కలశ నీటితో మహాకుంభాభిషేకం చేపట్టారు. భక్తులు మహాకుంభాభిషేక జలాలు తలపై పడితే మంచిదని భావించి భారీగా విచ్చేయడంతో ఆలయ ఆవరణలు కిటకిటలాడాయి.

స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులు రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులు, ఏదైనా డిగ్రీ పొందిన వారు అర్హులని తెలిపారు. సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్ శిక్షణకు ఎస్ఎస్‌సీ పాస్ లేక ఫెయిల్ అయిన వారు అర్హులని వివరించారు. ఆసక్తిగల వారు తమ పేర్లను http://forms.gle/R68cChqap16vVFoo9 లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 63009 54441 నంబర్‌లో సంప్రదించాలన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

ఆకట్టుకున్న అర్జున తపస్మాన్



వెదురుకుప్పం: తపస్మాన్‌ను అధిరోహిస్తున్న అర్జున వేషధారి



పాలసముద్రం: తపస్సుమాను మీద నుంచి చల్లే పూలు, నిమ్మకాయల కోసం ఎగబడుతున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. అంతకుముందు ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించి భక్తి ప్రపత్తులతో విశేష పూజలు చేపట్టారు. అనంతరం అర్జున వేషధారి శివతత్వ గీతాలతో తపస్మాన్‌ను అధిరోహించే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. సంతాన ప్రాప్తి కోసం మహిళలు వరపడ్డారు. అర్జునుడి వేషధారి విసిరిన నిమ్మకాలు, పూజాసామగ్రి కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం భాగవతారిణి విజయకుమారి హరికథా కాలక్షేపం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ వీధి నాటక ప్రదర్శనను కళాకారులు రక్తికట్టించారు.

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ద్రౌపదీదేవి అమ్మవారి మహాభారత ఉత్సవాలు భాగంగా రాత్రి ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకం జనాలను ఆకట్టుకుంది. బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా జరిగింది. శ్రీవేంకటేశ్వర కళామండలి అర్జున వేషధారి పీలేరు శివ తపస్మాన్ చెట్టులోని ప్రతి మెట్టుకూ పరమశివుడిని వేడుకుంటూ పద్యాలు ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించాడు. సంతానం లేక బాధపడుతున్న పలువురు మహిళలు తపస్సుమాను వద్ద వరపడి సంతానం కలగాలని వేడుకున్నారు. అర్జునుడు తపస్సుమాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, విబూదిపండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈసారి మండల పరిధిలో తమిళనాడు, కర్ణాటక నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది.